# 'కాలేయం' కాటేస్తుంది జగ్రత్త!

## ○ హెచ్చరించిన నిపుణులు
## ○ మియాట్‌లో 'లివర్ జిమ్' ప్రారంభం

**చెన్నై, న్యూస్‌టుడే:** మానవ శరీరంలో ఎంతో కీలకమైన కాలేయం ఆదమరిస్తే ప్రాణాంతకంగా మారుతుందని. పలువురు వైద్య నిపుణులు హెచ్చరించారు. కాలేయ రోగులకు ఉపయోగకరంగా ఉండేలా చెన్నైలోని మియాట్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన 'లివర్ జిమ్' కేంద్రాన్ని శనివారం ఆసుపత్రి ఛైర్మన్ మల్లికామోహన్ దాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కేంద్రం కాలేయ రోగులకు ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుందన్నారు. కాలేయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఇక్కడ ఉచితంగా నిర్వహిస్తామని వెల్లడించారు. సాధారణంగా ఈ పరీక్షలకు రూ.6 వేలు వ్యయమవుతుందని తెలిపారు. ప్రజలు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసుపత్రి ఎండీ డాక్టర్ పృథ్వీ మాట్లాడుతూ కాలేయ మార్పిడికి దాతల కొరత ఎక్కువగా ఉందని, ఖర్చు కూడా ఎక్కువవుతోందని అన్నారు. సామాన్యులకు ఇది అందుబాటులోకి రావాలంటే కాలేయ దానంపై అవగాహన పెరగాలన్నారు. కాలేయ వ్యాధులను సకాలంలో గుర్తించేందుకు లివర్ జిమ్ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలేయ వైద్య నిపుణులు డాక్టర్ విజయరాఘవన్, విమల్‌రాజ్, వేలాయుధం, మిరియం థామస్‌లు మాట్లాడుతూ కాలేయ సమస్య వల్ల జరుగుతున్న నష్టాలను వివరించారు. మద్యపానం, ధూమపానం లాంటి వ్యసనాల వల్ల ఇప్పుడు యువతలోనూ ఈ సమస్య పెరుగుతుండటంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మన దేశంలో ప్రతి ఐదుగురిలో ఒకరికి కాలేయ వ్యాధి ఉందని, 2025 నాటికి ప్రపంచంలోనే కాలేయ వ్యాధిగ్రస్తులు ఎక్కువ ఉన్న దేశంగా భారత్ నిలుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై సామాజిక సంస్థలు కూడా చైతన్య కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలని కోరారు.



**లివర్‌జిమ్ ప్రారంభ కార్యక్రమంలో మల్లికామోహన్‌దాస్, డాక్టర్ పృథ్వీ తదితరులు**